క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

సత్యవేడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారుల మెగా చెక్కు పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరు కానున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కే.సుశీల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అర్హులుగా ఎంపికైన డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా మంజూరు పత్రాలను ఎమ్మెల్యే అందజేస్తారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు కావాలని ఆయన కోరారు.

కేవీబీపురం: సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నేడు మండలంలో పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు ఎంపీడీఓ కార్యాలయం వద్ద అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం పార్టీ శ్రేణులతో సమావేశమవుతారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీ నేత వెంకటరమణ మృతి


వెంకటరమణ (ఫైల్)

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల యూత్ మాజీ అధ్యక్షుడు పానుగోటి వెంకటరమణ అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. మృతదేహానికి ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నివాళులర్పించారు. ఆయన కుటుంబాన్ని పార్టీ అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

నిత్యాన్నదానానికి రూ.91 వేల విరాళం


విరాళాన్ని అందజేస్తున్న దాత

కాణిపాకం(యాదమరి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి నిత్యాన్నదానానికి రూ.91 వేలను విశాఖపట్నంకు చెందిన మురళీకృష్ణ విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. మంగళవారం దాత కుటుంబసభ్యులతో కలిసి స్వామి వారి దర్శనార్థం విచ్చేసి విరాళం అందించారు. ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు పాల్గొన్నారు.

కేంద్రానిది కపట ప్రేమ

కేవీబీపురం: రాష్ట్ర ప్రజలపై కేంద్ర ప్రభుత్వం కపట ప్రేమను కనబరుస్తోందని సీపీఎం రాష్ట్ర రైతు విభాగం జిల్లా కార్యదర్శి దాసరి జనార్దన్ ఆరోపించారు. ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించి ఆయన బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో భాగంగా రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీలో చేపడుతున్న మహా సంఘర్షణ కార్యక్రమానికి రైతులు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. మండల కార్యదర్శి నాగరాజు, రైతు నేతలు నాగూరు, రఘు, వెంకటయ్య, చిరంజీవి, శాంతి పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల తనిఖీ

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు గిట్టుబాటు ధర రూ.257 వచ్చే విధంగా పనిచేయాలని అంబుడ్స్ పర్సన్ రాసరాయనాయుడు అన్నారు. మంగళవారం ఆయన తొట్టంబేడు మండలంలోని చియ్యవరం పంచాయతీలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మస్టర్‌ను పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పనికి వచ్చిన ప్రతి కుటుంబం 100 రోజుల పనులను కొలతల ప్రకారం పూర్తి చేయాలని సూచించారు. రైతులకు ఉపయోగపడే పనులు ఏవైనా చేసుకోవాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ సుజాత, ఉపాధి సిబ్బంది సహాయకులు పాల్గొన్నారు.

ఏడుగురిపై కేసు నమోదు

ఏర్పేడు: ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి మంగళవారం రాత్రి తెలిపారు. మండలంలోని బండారుపల్లి గ్రామానికి చెందిన తంజావూరు శోభన్‌బాబుపై ఈ నెల15న ఆస్తి తగాదాల కారణంగా అదే గ్రామానికి చెందిన మునిచంద్రమ్మ, చిరంజీవి, హరి, విజయ, తిరుపాల్ శెట్టి, బుల్లెమ్మ, మురగవేల్ దాడి చేసి గాయపరచినట్లు చెప్పారు. చికిత్స కోసం శ్రీకాళహస్తి ఏరియాకు తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన శోభన్‌బాబు భార్య శారద ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

అమ్మోరుకు అంబలి


భక్తులకు అంబలి పోస్తున్న స్థానికులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలో ఇటీవల ఎక్కువమందికి అమ్మోరు పోస్తోంది. ఈ సందర్భంగా ఏడవ గంగమ్మ నిలిచే ప్రదేశమైన కొత్తపేట గంగమ్మ రాయి వద్ద పరిసర ప్రాంత ప్రజలంతా అంబలి పోసి శాంతించు అమ్మోరు తల్లి అంటూ వేపమండలు కట్టిన దుత్తలో అంబలిపోసి మొక్కులు చెల్లించారు. స్థానిక మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు భరోసా.. వైఎస్సార్ ఆసరా


వరదయ్యపాళెంలో హాజరైన డ్వాక్రా మహిళలు



వరదయ్యపాళెంలో ఆసరా లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

- సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం
- వైఎస్సార్ ఆసరా మెగా చెక్కు పంపిణీ

వరదయ్యపాళెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తున్నారని, అక్కచెల్లెమ్మలకు కొండంత అండగా ఆసరా నిలుస్తోందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం వరదయ్యపాళెం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా సంబరాలకు పెద్దఎత్తున అక్కచెల్లెమ్మలు తరలివచ్చారు. పరిసరాలు మహిళలతో కిటకిటలాడడంతో ఆసరా సంబరాలు అంబరాన్నంటాయి. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే ఆదిమూలం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా ఆసరా లబ్ధిదారులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం మండలంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడవ విడతలో మంజూరైన 857 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.7.42కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ప్రకటించి తేదీల వారీగా పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసేందుకు ఆశీర్వదించాలని కోరారు. మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు దామోదర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు సిరాజ్ బాషా, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు బొప్పన పద్మావతి, శ్యామలమ్మ, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ చిన్నా, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బందిల సురేష్, మండల యూత్ కన్వీనర్ వినోద్ కుమార్ యాదవ్, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి లతీఫ్, డైరెక్టర్ అబ్దుల్, ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, ఈఓపీఆర్డీ విజయకుమారి, ఏపీఎం తిరుమలరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా నగదు చెక్కు పంపిణీ..

మండలంలోని సీఎల్ఎన్‌పల్లిలో ప్రమాదవశాత్తు మరణించిన సిరాజ్ బాషా భార్యకు రూ. 5లక్షలు బీమా నగదు మంజూరు కావడంతో సంబంధిత చెక్కును భార్య సలీమా బీకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చేతుల మీదుగా స్థానిక సర్పంచ్ దుద్దు వేణు పంపిణీ చేశారు.

సీఎం జగన్‌తోనే మహిళాభ్యుదయం

బుచ్చినాయుడుకండ్రిగ: మహిళలను మహారాణులుగా చూడాలని, మహిళలకు ఆర్థిక స్వావలంభన కల్పించాలని, మహిళా సాధికారితే లక్ష్యంగా సాయం అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేశారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తెలిపారు. మంగళవారం బుచ్చినాయుడుకండ్రిగలోని మార్కెట్ యార్డులో అవరణలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా పథకంలో 729 సంఘాలకు రూ.6,61,00,724ల మెగా చెక్కును పంపిణీ చేశారు. భారీ సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. లబ్ధిదారులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహిళా సంఘాలు వేసిన నవరత్నాల లోగో ఆకట్టుకుంది. వైఎస్సార్‌సీపీ కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి, ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ప్రతిమ, సీఐ విక్రమ్, నేతలు నిరంజన్‌రెడ్డి, అజయ్‌కుమార్‌రెడ్డి, సుందర్‌రెడ్డి, మునిరాజా, ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు, ఎస్ఐ మంజునాథరెడ్డి, ఐకేపీ ఏపీఎం ఇందిరమ్మ పాల్గొన్నారు.


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు


బుచ్చినాయుడుకండ్రిగలో వైఎస్సార్ ఆసరా చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

బల్లలు మోయించడంపై విచారణ


ప్రిన్సిపల్‌తో మాట్లాడుతున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ : స్థానిక ఏకలవ్య గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులతో బల్లలు మోయించడంపై మంగళవారం ఎంఈఓ రవీంద్రనాథ్ విచారణ చేపట్టారు. సాక్షి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన విద్యార్థులతో బల్లలు మోయిస్తారా కథనంపై జిల్లా డీఈఓ శేఖర్ స్పందించి విచారణ చేయాలని ఎంఈఓను ఆదేశించారు. దీంతో ఆయన విద్యార్థులతో బల్లలు మోయించడం త ప్పని ప్రిన్సిపల్ దామోదర్‌నాయుడును హెచ్చరించి విచారణ చేశారు. విచారణ నివేదికను డీఈఓకు అందజేస్తామని ఎంఈఓ తెలిపారు.

పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



ఏర్పేడు: మండలంలోని మునగలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం వన్స్ హెల్ప్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్‌లను పంపిణీ చేశారు. పాఠశాలలోని 60 మంది పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్సిళ్లు, పెన్నులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వన్స్ హెల్ప్ గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షుడు మెరుం మురుగేష్, హెచ్ఎం రాజవేలు, ఫౌండేషన్ కార్యదర్శి మునేంద్ర, సభ్యులు బాబు, శేఖర్, రాజా, ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి వేడుకలు రేపు

పిచ్చాటూరు: ఈనెల 30న వేదనారాయణ ఆలయ ఆవరణలో కొలువుదీరిన కోదండ రాముని సన్నిధిలో శ్రీరామనవమి వేడుకలు నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు వెల్లడించారు. గురువారం ఉదయం సుప్రభాతం, తోమాలసేవ, సర్వదర్శనం ఉంటుందన్నారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల మధ్యలో లక్ష్మణ సమేత సీతారాములకు తిరుమంజనం నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం శ్రీరామనవమి ఆస్థానం, 11 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం, సాయంత్రం 6 గంటలకు లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవమూర్తుల తిరువీధి ఉత్సవం జరుగుతుందన్నారు. రాత్రి 8 గంటలకు ఏకాంతసేవతో పరిసమాప్తి అవుతుందని పేర్కొన్నారు.

30న శ్రీరామనవమి వేడుకలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ఆలయమైన నెహ్రూవీధిలోని శ్రీపట్టాభిరామ మందిరంలో 30వ తేదీ శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఈఓ సాగర్‌బాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 30వ తేదీ ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో శ్రీసీతారామ కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఆలయ చైర్మన్

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయమైన శ్రీపట్టాభిరామ మందిరంలో ఈ నెల 30న జరగనున్న కల్యాణోత్సవ ఏర్పాట్లను మంగళవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని వరదరాజులస్వామి ఆలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే ఆలయ పునర్నిర్మాణంలో ఉన్న నేపథ్యంలో పట్టాభిరామ ఆలయంలోనే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయం చిన్నది కావడంతో భక్తులు ఎక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉందన్నారు. ఈనేపథ్యంలో భక్తులంతా వీక్షించే విధంగా కల్యాణవేదిక ఏర్పాటు చేసి బహిరంగంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అందుకు పోలీసు అధికారులతో చర్చించి 30వ తేదీన నెహ్రూరోడ్డులో రాకపోకలను పూర్తిగా నిషేధించి ట్రాఫిక్ డైవర్షన్ చేసే విధంగా చేయాలని కోరామన్నారు. 29న ముక్కంటి ఆలయం తరఫున పట్టువస్త్రాలు సమర్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసశర్మ, అధికారులు కిషోర్, పవన్‌కల్యాణ్, స్థపతి కుమార్ సూర్యప్రసాద్, బాలాజీ పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న పాలకమండలి చైర్మన్

చెత్త నుంచి సంపద తయారీతో ఆదాయం

సత్యవేడు: చెత్త సంపదను సృష్టించడంవల్ల పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని డీఎల్‌పీఓ రూపారాణి అన్నారు. మంగళవారం సత్యవేడు తెలుగు గంగ కాలువ సమపంలో చెత్త నుంచి సంపద కేంద్రం వద్ద తడి, పొడి చెత్త ద్వారా సంపదను ఎలా పొందడం అనే కార్యక్రమంపై తొట్టంబేడు, శ్రీకాళస్త్రి, వరదయ్యపాళెం మండలాల్లోని ఆరు పంచాయతీల సర్పంచులకు, ఉపసర్పంచులు, సచివాలయ కార్యదర్శులు, వ్యవసాయ అసిస్టెంట్లలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆరు రోజుల జరిగిన శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశానికి డీఎల్‌పీఓ హాజరై కేంద్రాన్ని పరిశీలించి ఆమె మాట్లాడారు. పంచాయతీల ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రజాప్రతినిధులు, పంచాయతీ అధికారులు దృష్టి సారించాలన్నారు. జగనన్న స్వచ్ఛసంకల్పంలో భాగంగా పంచాయతీల్లో పారిశుధ్యం అమలుకు ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని తెలిపారు. సర్పంచ్‌లు మంజుల, రమేష్. మహేంద్ర, కే.లోకేశ్వరి, శ్యామల, కే. సుబ్రమణ్యం, స్వప్న, డి.పద్మజ, జగనన్న స్వచ్ఛసంకల్పం జిల్లా రిసోర్సు పర్సన్ జి.రవికుమార్, ఈఓపీఆర్డీ సురేంద్రనాథ్(శ్రీకాళహస్తి) ఎంపీఓ కే. రవి, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ మునిరవికుమార్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ

సిపాయి విద్యాదీవెన అందజేత

ఏర్పేడు: సిపాయి విద్యాదీవెన పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం ఏర్పేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిపాయి విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ సిపాయి విద్యాదీవెన కింద పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేస్తున్నట్లు వివరించారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. విద్యతోనే విజ్ఞానం లభిస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా మార్చినట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఇంగ్లిషు మీడియంతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పిస్తుండడం గొప్ప విషయమన్నారు. ప్రభుత్వ స్కూళ్లల్లో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో బోధన ఉంటుందన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, హెచ్‌ఎం సునీత, నాయకులు తిరుమలరెడ్డి, సుబ్రమణ్యం, మునిశేఖర్, వినోద్, వెంకటముని, ప్రభాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, గున్నేరి కిషోర్‌రెడ్డి

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న సీడీపీఓ శాంతిదుర్గ

ఏర్పేడు: చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలతో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని శ్రీకాళహస్తి సీడీపీఓ శాంతిదుర్గ అన్నారు. మంగళవారం మండలంలోని మద్రిమంద అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమం జరిగింది. ఆమె మాట్లాడుతూ పోషణ పక్వాడా ఈ నెల 23 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు జరుగుతుందన్నారు. పోషకాహార లోపంతో గర్భిణులకు రక్తహీనత, మాతాశిశు మరణాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందించే పోషకాహారంతో పాటు తాజా కూరగాయలు, ఆకుకూరలు, పప్పుదినుసులతో కూడిన భోజనాన్ని తీసుకోవాలని సూచించారు. పాపానాయుడుపేట పీహెచ్‌సీ డాక్టర్ అభిజ్ఞ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేవతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రపంచంలో తరగనిది విద్య ఒక్కటే


విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న ఎంఈఓ

శ్రీకాళహస్తి రూరల్ : ప్రపంచంలో వాడే కొద్ది అన్ని వస్తువులు తరిగిపోతాయని, విద్య మాత్రం ఎన్నటికీ తరగదని ఎంఈఓ భువనేశ్వరి అన్నారు. మండలంలోని తొండమనాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం హెచ్‌ఎం శ్రీనివాసులు అధ్యక్షతన సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఎవరు ఎంత ఆస్తి సంపాదించినా తరిగిపోని ఆస్తి విజ్ఞానమేనని చెప్పారు. బాల్యదశ నుంచి పుస్తక పఠనంతో పాటు ముఖ్యంగా క్రమశిక్షణ కూడా అలవరచుకోవాలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు ఇదే తొలిమెట్టు అని, కష్టంగా కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నతస్థానాలను అధిరోహించవచ్చన్నారు. పాఠశాలకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకుని రావాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరై ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తే మంచి ఫలితాలు సాధించడం తథ్యమని తెలిపారు. అనంతరం ప్రజాప్రగతి ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులకు పాదపూజ చేశారు. ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్ సారిక, ప్రజాప్రగతి ట్రస్ట్ కో-ఆర్డినేటర్లు చంద్రశేఖర్, సుస్మిత, శ్రీనివాసులు పాల్గొన్నారు.

హాస్టల్లో ఆకస్మిక తనిఖీలు


భోజనాన్ని పరిశీలిస్తున్న న్యాయవాదులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని తెలుగుగంగ కాలనీలో ఉన్న మహిళా డిగ్రీ కళాశాల వెనుక వైపు ఉన్న మహిళా హాస్టల్‌ను శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్‌జడ్జి బేబీరాణి ఆదేశాల మేరకు న్యాయవాదులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందుతున్న భోజన, నీటి వసతిపై ఆరా తీశారు. అనంతరం భోజనం రుచి చూశారు. హాస్టల్ చుట్టూ కాంపౌండ్ వాల్ లేకపోవడంతో భద్రత లేదని గుర్తించారు. పందుల సంచారంతో అనారోగ్యం పాలయ్యే అవకాశం ఉందన్నారు. ఈ విషయాలను న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. న్యాయవాదులు ప్రజ్ఞశ్రీ, రాజేశ్వరరావు, రమేష్, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో మెరుగైన ఆరోగ్యం


గ్రామంలో పర్యటిస్తున్న వైద్యాధికారులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్) : గ్రామాల్లో ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి తెలిపారు. మంగళవారం మండలంలోని పొయ్యి గ్రామంలో జ్వరాలు అధికంగా ఉండడంతో ఆయన వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. ఆయన మాట్లాడుతూ పంటకాలువల్లో నీరు గ్రామ సమీపంలో నిలవడంతో దోమలు వృద్ధి చెంది జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని తెలిపారు. చెరువులోని నీరు పంట కాలువల్లో నిలబడకుండా చూడాలని అధికారులకు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉన్నం వాసుదేవనాయుడుకు సూచించారు. అనంతరం వైద్యసిబ్బందిని గ్రామంలో జ్వరాల బారిన పడిన వారికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేయాలని ఆదేశించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతంలో దోమల లార్వాలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయించారు. ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి డివిజన్ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుధారాణి, జిల్లా ఇన్‌చార్జ్ మలేరియా అధికారి డాక్టర్ శ్రీనివాసరావు, తొట్టంబేడు ఇన్‌చార్జ్ వైద్యాధికారి డాక్టర్ తేజేశ్వరి, వైద్యాధికారులు డాక్టర్ లహరి, డాక్టర్ సాయి పూజ, జిల్లా ఎపిడెమిక్ సెల్ డాక్టర్ కిరణ్ నాయక్, ఎంపీహెచ్‌ఈఓ రామాంజనేయరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు, వైద్యసిబ్బంది సంపూర్ణమ్మ, భారతి పాల్గొన్నారు.

శ్మశానంలో వ్యర్థాల తొలగింపు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పానగల్ హిందూ శ్మశాన వాటికలో భవన వ్యర్థాలను పానగల్ గంగమ్మ ఆలయ కమిటీ వారు తొలగించారు. వ్యర్థాలు దారికి ఇరువైపులా అడ్డుగా ఉండడంతో అంత్యక్రియల సమయంలో ఇబ్బంది పడేవారు. మంగళవారం వారు జేసీబీ సాయంతో వ్యర్థాలను తొలగించి శ్మశాన వాటికకు దారి కల్పించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.